www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 9 ఫిబ్రవరి 2025



చంద్రబాబును కలిసిన 'అద్దెపల్లి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి క్షత్రియుల సంక్షేమానికి పెద్దపీట వేసి రాజంపేట అభివృద్ధికి బాటలు వేయాలని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దెపల్లి ప్రతాప్‌రాజు ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. శనివారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం క్షత్రియులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు సహాయ సహకారాలు అందించాలని, ప్రధానంగా రాజంపేట అసెంబ్లీ కేంద్రంలో ఉన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు ప్రతాప్‌రాజు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ రాజంపేట నియోజకవర్గంలో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని అన్నారు. టిడిపి కష్ట కాలంలో ఉన్నప్పుడు పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పించాలని, పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు జన్మస్థలమైన తాళ్లపాక, బోయినపల్లి గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధికి బాటలు వెయ్యాలని కోరినట్లు తెలిపారు. సమస్యలపై సీఎం సానుకూలంగా స్పందించి త్వరలోనే పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చినట్లు వివరించారు. పార్టీలో ఉన్నటువంటి అసమ్మతులను తొలగించి ఇన్‌ఛార్జిని ప్రకటిస్తామని ప్రకటించినట్లు వివరించారు.

బుడ్డశనగపై గోలగోల!

- నకిలీ విత్తన విక్రేతలపై కేసులు
- ఎంఎస్‌పి ధరను పెంచి ఇవ్వాలి : ఎంపీ
- కుంభగిరి కాలనీ లీకేజీలను అరికట్టండి: ఎమ్మెల్యే సుధా
- సిబిఎస్‌ఇ విద్యార్థులకు స్టేట్‌సిలబస్ పరీక్షలా : ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి
- తొమ్మిది గంటల విద్యుత్ సరఫరాపై స్పష్టత ఇవ్వండి
- రెండు తీర్మానాలకు ఆమోదం
- కూటమి ఎమ్మెల్యేలు డుమ్మా



సమావేశంలో మాట్లాడుతున్న కడప జిల్లా జెసి అదితిసింగ్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలోని బుడ్డశనగ, కందులు, పెసర, నువ్వుల దిగుబడులు గణనీయంగా తగ్గాయని, ఇటువంటి పరిస్థితుల్లో బుడ్డశనగను రూ.5,650 ధరను నిర్ణయించడం దారుణమని కడప ఎంపీ వై.ఎస్ అవినాష్‌రెడ్డి వాపోయారు. శనివారం జిల్లా పరిషత్ ఛైర్మన్ జేష్యాధి శారద అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు గైర్హాజరైన నేపథ్యంలో కడప ఎంపీ దగ్గర నుంచి జడ్‌పిటిసి వరకు బయటికి వెళ్లి ఛైర్మన్ ఛాంబర్‌లో నిరీక్షించారు. జడ్‌పి సిఇఒ కలెక్టర్, జాయింట్ కలెక్టర్లను ఫోన్‌లో సంప్రదించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ హాజరు కావడంతో సమావేశం ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ సమీక్షలో భాగంగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం బుడ్డశనగ విత్తన ధర రూ.7,350 విక్రయించిందని, కొనుగోలు దగ్గరికి వచ్చే సరికి క్వింటాల్ రూ.5,650 ప్రకటించడం ఏమిటని నిలదీశారు. బుడ్డశనగ దిగుబడులు తగ్గిన నేపథ్యంలో ధరను తగ్గించడం దారుణమని, రాష్ట్ర ప్రభుత్వం అదనపు భారాన్ని భరించి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో 25 శాతం క్రాఫ్ కటింగ్ చేసిన నేపథ్యంలో క్రాఫ్ కటింగ్ ఎప్పుడు చేస్తారని నిలదీశారు. రాష్ట్రప్రభుత్వం క్రాప్ కటింగ్ చేసేసరికి 50 శాతానికిపైగా రైతులు నూర్పిడి చేసుకుని దళారులకు విక్రయించేస్తారని, అప్పుడు రైతులకు బదులు దళారులు లబ్ధి పొందుతారని ఆందోళన వ్యక్తం చేశారు. చక్రాయపేట మండలం కె.రాజుపల్లి తాగునీటి స్కీమ్ చాలా అధ్వానంగా పని చేస్తోందని, 67 గ్రామాలకు 15 గ్రామాలకు సైతం తాగునీటిని సరఫరా చేయడం లేదన్నారు. అనంతరం కడప, అన్నమయ్య జెడిఎలు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో రూ.7850 లతో కందు లను కొనుగోలు చేస్తామన్నారు. డ్రోన్ టెక్నాలజీ ఆధారంగా పురుగు మందులను పిచికారీ చేయడం ద్వారా వృథాను అరికట్టవచ్చని తెలిపారు. ఎన్‌పి ఎస్‌ఎస్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవడం ద్వారా పంటలకు సోకిన తెగుళ్లను తక్షణమే గుర్తించడం సులభంగా మారిందన్నారు. బి.మఠం ఎంపిపి వీరనారాయణరెడ్డి మాట్లాడుతూ బి.మఠం మండలంలో నకిలీ వరి విత్తనాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని, నకిలీ విక్రేతలపై కేసులు నమోదు చేయడం ద్వారా నకిలీల బెడదను అధిగమించాలని సూచించారు. దీనికి డిఎఒ స్పందించి నకిలీ విత్తన విక్రేతలపై కేసు నమోదు చేయడంతోపాటు పరిహారం వసూలు చేసే చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్‌సుధ మాట్లాడుతూ పోరుమామిళ్ల ప్రభుత్వాస్పత్రి వైద్యులను డిప్యూటేషన్ వేయడం దారుణమని, రోజుకు 300 మంది రోగులు ఆస్పత్రికి వస్తుంటారని, అటువంటి ప్రాంతం నుంచి పెన్షన్ల రీఅసెస్మెంట్‌కు వేయడం ఏమిటని ప్రశ్నించారు. బద్వేల్ నియోజకవర్గం అట్లూరు మండల పరిధిలోని కుంభగిరి కాలనీలోని పక్కాగృహాలు చిన్నపాటి వర్షానికే ఉరుస్తున్నాయని, వాటి మరమ్మతు నిధులను పెంచడమా, కొత్తగా పక్కాగృహాలను కేటాయించడమా అనేది ఆలోచించాలని డిమాండ్ చేశారు. కమలాపురం సిహెచ్‌సిలో సర్జన్, గైనకాలజిస్టులు లేకపోవడంతో మహిళలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చింతకొమ్మదిన్నె జడ్‌పిటిసి నరేన్ రామాంజులరెడ్డి సభ దృష్టికి తెచ్చారు. జిజిహెచ్ కేన్సర్‌కేర్‌లో స్పెషలిస్టుల కొరత కారణంగా నాణ్యమైన వైద్యసేవలు అందడం లేదన్నారు. ప్రొద్దుటూరు జిజిహెచ్‌లోఎంఆర్‌ఐ సేవలు చాలా అధ్వానంగా ఉన్నాయని, రోజుల తరబడి తిప్పుకుంటున్నారని, ప్రజాప్రతినిధులు అనే గౌరవం కూడా లేదని, అటువంటి అధికారిపై చర్యలు తీసుకో వాలని యర్రగుంట్ల జడ్‌పిటిసి డిమాండ్ చేశారు. దీనికి జెసి స్పందించి విచారించి చర్యలు తీసుకు ఒటామని హామీ నిచ్చారు. పిహెచ్‌సి కేంద్రాల్లో మూడు నెలలకోసారి నిర్వహించాల్సిన సమీక్షా సమావేశాలు నిర్వహించడం లేదన్నారు.



హాజరైన ప్రజాప్రతినిధులు

అనంతరం చక్రాయపేట మం డలంలోని 22 మంది ఫీల్డ్ అసిస్టెంట్లలో 15 మందిని తొలగించడం ఏమిటని నిలదీశారు. దీనికి డ్వామా పీడీ స్పందించి చిన్నపాటి లోపాలు ఉంటే హెచ్చరిస్తామని, ఆర్థిక పరమైన తప్పిదాలు ఉంటే తొలగిస్తున్నామని తెలిపారు. అనంతరం చింతకొమ్మదిన్నె జడ్‌పిటిసి నరేన్‌రామాంజులరెడ్డి, వైస్ ఛైర్మన్ బాలయ్యయాదవ్, వీరపునాయునిపల్లి జడ్‌పిటిసిమాట్లాడుతూ జిల్లాలో తొమ్మిది గంటలు కరెంటు ఇస్తున్నారా, ఏడు గంటలు ఇస్తున్నారనే అంశంగా స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనికి ట్రాన్స్‌కో ఎస్‌ఇ స్పందించి సిఎండి ఆదే శాల మేరకు తొమ్మిది గంటలపాటు ఇస్తున్నామని వివరించారు. జిల్లావ్యాప్తంగా ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్లు, మెటీరియల్ కొరత వేధి స్తుండడంపై ఎంపీతోపాటు సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో చింతకొమ్మదిన్నె, జమ్మల మడుగు, రైల్వేకోడూరు, లక్కిరెడ్డిపల్లి ప్రాంతాల్లో అన్‌కనెక్టెడ్ బ్లాగ్స్ ఉన్నాయని, వాటిని కలుపుతూ పిఎంజిఎస్‌ఐ-4 కింద రహదారి నిర్మా ణాలు చేపట్టాల్సి ఉందన్నారు. గ్రామీణ జనాభా 500 మించిన గ్రామాలను పరిగణలోకి తీసుకోవాల్సిన నేపథ్యంలో ఎక్కువ రహదా రుల నిర్మాణాలు చేపట్టలేని పరిస్థితి నెలకొందన్నారు. దీనికి ఎంపీ స్పందించి 250 గ్రామీణ జనాభాను ఆధారంగా తీసుకోవాలని తీర్మా నం చేద్దామని ప్రతిపాదించారు. దీంతో జిల్లావ్యాప్తంగా పలు గ్రా మాల్లో రహదారులు నిర్మించే వెసులుబాటు కలుగుతుందని చెప్పారు. అనంతరం ఎంఎల్‌సి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 30 సిబిఎస్‌ఇ సిలబస్ పాఠశాలల విద్యార్థులను స్టేట్ సిలబస్‌లో పరీక్షలు నిర్వహించడం ఏమిటని, ఇంగ్లీష్ మీడియాన్ని ఎత్తేయాలను కుంటోందా అని ప్రశ్నించారు. సమావేశం ముగింపు నేపథ్యంలో జడ్పీ సిఇఒ స్పందిస్తూ జిల్లాలో అక్రమ మైనింగ్ నివారించాలని, పిఎంజిఎస్‌వై-4 స్కీమ్‌ను 250 గ్రామాలకు వర్తింపజేసేలా తీర్మా నాలను ఆమోదించినట్లు ప్రకటించారు. సమావేశానికి కూటమి తరుపున గెలిచిన ఎమ్మెల్యేలు గైర్హాజరు కావడం గమనార్హం. సమా వేశంలో జెసితోపాటు సిఇఒ, డిప్యూటీ సిఇఒ, ఉమ్మడి జిల్లాకు చెందిన జడ్పీటిసిలు, ఎంపిపిలు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

భారతదేశ న్యాయ వ్యవస్థ ఎంతో దృఢమైంది

- సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సరసా వెంకటనారాయణ భట్టి
- మదనపల్లిలో అడిషనల్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభం

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

భారతదేశ న్యాయవ్యవస్థ ఎంతో దృఢమైందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సరసా వెంకటనారాయణ భట్టి పేర్కొన్నారు. శనివారం మదనపల్లిలోని కోర్టు సముదాయంలో నూతనంగా నిర్మించిన అడిషనల్ సివిల్‌జడ్జి (సీనియర్ డివిజన్)కోర్టు భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమాన్ని మదనపల్లె బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుప్రీం కోర్టు న్యాయమూర్తి మాట్లాడుతూ దేశచరిత్రలో మదనపల్లి పట్టణానికి ప్రత్యేక గుర్తింపు ఉందని, విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జాతీయ గీతం జనగణమనను ప్రసిద్ధిగాంచిన బి.టి.కళాశాలలో బెంగాలీ నుంచి ఆంగ్లంలోకి తర్జుమా చేశారని గుర్తుచేశారు. భారత రాజ్యాంగం 470 ఆర్టికల్స్, 106 రాజ్యాంగ సవరణ చట్టాలు కలిగి ఉందన్నారు. వీటికి న్యాయవ్యవస్థతో సంబంధం ఉందనారు. ముఖ్యంగా ఆర్టికల్ 14 దేశ పౌరుల సమానత్వాన్ని తెలియజేస్తుందని తెలిపారు. సుప్రీంకోర్టు సర్వోన్నతమైందన్నారు. దేశ న్యాయవ్యవస్థకు సంబంధించి సర్వహక్కులు సుప్రీం కోర్టుకు ఉంటాయన్నారు. దేశంలోని హైకోర్టులు, జిల్లా కోర్టులు సుప్రీం కోర్టు ఆదేశానుసారం పనిచేస్తాయని అన్నారు. న్యాయవ్యవస్థపై దేశ ప్రజలకు మరింత నమ్మకం పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇది జరగాలంటే కేసులను త్వరితగతిన పరిష్కరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. గతంలో ఎంతోమంది ప్రధాన న్యాయమూర్తులు సుప్రీంకోర్టు ఔన్నత్యాన్ని పెంపొందించారని తెలిపారు. అదే స్ఫూర్తితో ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తులు పనిచేయడం దేశ న్యాయవ్యవస్థకు గర్వకారణమని అన్నారు. భారత రాజ్యాంగం, న్యాయవ్యవస్థ పరస్పర సహకారంతో దేశప్రతిష్ఠ పెంచుతున్నాయని కితాబిచ్చారు. ముఖ్యంగా మదనపల్లెలో తన చిన్ననాటి జ్ఞాపకాలు, విద్యాభ్యాసం, కళాశాల, లాయర్‌గా ప్రాక్టీస్, తన గురువులు అందించిన ప్రోత్సాహాన్ని సుప్రీంకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ సరసా వెంకటనారాయణ భట్టి గుర్తు చేశారు. అనంతరం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ మదనపల్లెకు ఎంతో ఘన చరిత్ర ఉందని, ఈ ప్రాంతానికి రావడం తనకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. మదనపల్లి కోర్టు సముదాయంలో ఉన్న మేజిస్ట్రేట్ కోర్టు భవనం పూర్వం ఎంతో నైపుణ్యంగా రాతి కట్టడంతో కట్టారని, ఆ భవనాన్ని యథా స్థితిలో ఉంచి, స భవనం పైనే మరో కొత్త భవనం ఏర్పాటు చేసి మరో కోర్టును ఇస్తామని తెలిపారు. ఇక్కడి ప్రజలు ఎంతో ఆప్యాయంగా తమకు స్వాగతం పలికారని, కుటుంబ సమేతంగా ఇక్కడికి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ ఇక్కడే జనగణమన ఆలపించడం, జిడ్డుకృష్ణమూర్తి ఈ ప్రాంతవాసి కావడం, బిటి కళాశాల ఉండడం, ఇంత ఘన చరిత్ర ఉన్న మదనపల్లెలో కోర్టు భవనం ప్రారంభించడం జ్ఞాపకంగా ఉంటుందన్నారు. ప్రశాంతతకు మారుపేరైన మదనపల్లెకు న్యాయపరమైన ఎలాంటి అవసరాలు కచిచ్చితంగా పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో హైకోర్టు జడ్జిలు జస్టిస్ బి.కృష్ణమోహన్, జస్టిస్ టిసిడి శేఖర్ , బార్ అసోసియేషన్ అధ్యక్షులు తొట్లి వెంకటర మణారెడ్డి, చిత్తూరు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ జడ్జి భీమారావు, బార్ అసోసియేషన్ సభ్యులు సుప్రీంకోర్టు న్యాయమూర్తి, ఎపి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో రెండవ అదనపు జిల్లా జడ్జి జస్టిస్ అబ్రహామ్, ఇతర కోర్టుల న్యాయమూర్తులు వెంకటేశ్వర్ నాయక్, సిరీష్, విజయకుమార్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, అడిషినల్ ఎస్‌పి వెంకటాద్రి, తహశీల్దార్ ధనుంజయులు, సిఐలు సత్యనారాయణ, కళా వెంకటరమణ, ఎరిషా వల్లి, రామచంద్ర, ఎస్ఐలు పాల్గొన్నారు.



కోర్టు శిలాఫలకం ఆవిష్కరణలో న్యాయమూర్తులు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

- స్కూటర్‌ను ఢీకొన్న ఐచర్ వాహనం
- మృతుల్లో భర్త, ఇద్దరు చిన్నారులు
- తీవ్రంగా గాయపడిన భార్య

ప్రజాశక్తి-ములకలచెరువు

రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. ఈ సంఘటన శనివారం ములకలచెరువులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. సత్యసాయి జిల్లా, గాండ్లపెంట మండలానికి చెందిన సోమశేఖర్ మదనపల్లెలో భవన కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే సోమశేఖర్ బంధువుల దివాసాలు ఉండగా శనివారం తన ద్విచక్ర వాహనంలో ఇద్దరు పిల్లలు, భార్యతో మదనపల్లి నుంచి కదిరికి బయలుదేరాడు. మార్గ మధ్య ములకలచెరువు షాది మహల్ సమీపానికి రాగానే కదిరి నుంచి మదనపల్లె వైపు వస్తున్న ఐచర్ వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో సోమశేఖర్(35) అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య కవిత, కుమారుడు రెడ్డిశేఖర్(5), సిద్దేశ్వరి(3) తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గాయపడిన వారిని చికిత్స నిమ్మిత్తం మూలకలచెరువు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం చిన్నారులును ప్రయివేట్ వాహనంలో, కవితను 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మదనపల్లి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ చిన్నారి సిద్దేశ్వరి మృతి చెందింది. కవిత కుమారుడు రెడ్డిశేఖర్‌ను మెరుగైన వైద్యం కోసం తిరుపతిలో రెఫర్ చేశారు. తిరుపతి రూయాలో రెడ్డి శేఖర్ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. కవిత పరిస్థితి విషమంగా ఉంది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదచాయలు అలుముకున్నాయి. సంఘటనపై ములకలచెరువు పోలీసులు కేసు నమోదు విచారణ చేపట్టారు. గత రెండేళ్ల కిందట ఇదే ప్రాంతంలో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు.



మృతి చెందిన చిన్నారులు రెడ్డిశేఖర్, సిద్దేశ్వరి

ఆశాలతో విధులు నిర్వహించడం సరికాదు

- విద్యార్థుల ప్రాణాలతో చేలగాటమాడొద్దు
- సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతున్న కేంద్రాల వద్ద ఆశా కార్యకర్తలతో విధులు నిర్వహించడం దుర్మార్గమని, వెంటనే రద్దు చెయ్యాలని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షల సందర్భంగా ఆ కేంద్రాల వద్ద వైద్య, ఆరోగ్య సిబ్బందిని ఏర్పాటు చెయ్యడం ప్రభుత్వ భాధ్యత అన్నారు. విద్యార్థులు ఏదైనా అసౌకర్యానికి గురైనా, అనారోగ్య సమస్యలు వచ్చినా పరీక్షించి, ప్రథమ చికిత్స అందించడానికి కృషి చెయ్యాల్సిన వైద్యాధికారులు వైద్యం పట్ల ఏ మాత్రం అవగాహన లేని ఆశాలతో వైద్యం అందించడమంటే విద్యార్థుల ప్రాణాలతో చెల గాటమాడటమేనని అన్నారు. ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్‌ఎం లను కాకుండా ఆశా కార్యకర్తలను పరీక్ష కేంద్రాల వద్ద ఉండాలని చెప్పడం వారిని వేధింపులకు గురిచెయ్యడంలో భాగమేనని ఆరోపించారు. అధికారులు స్పందించి పరీక్ష కేంద్రాల వద్ద ఆశాలకు వేసిన డ్యూటీలను వెంటనే రద్దు చెయ్యాలని, ఎంఎల్‌హెచ్‌పి, ఏఎన్‌ఎంలకు భాధ్యత అప్పగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసి, విద్యార్థుల తరపున పోరాడుతామని హెచ్చరించారు.

తెలుగువారి గొప్పతనాన్ని ప్రపంచానికి చాటాలి

- ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షులు మండలి బుద్ధప్రసాద్

ప్రజాశక్తి- కడప అర్బన్

రచయితలు నిజాయితీతో, నిర్భీతితో సామాజిక వాస్తవాలను ఎలుగెత్తి చాటాలని, అప్పడే ఆ సాహిత్యం దర్పణంగా నిలుస్తుందని, సమాజంలో మార్పులు తెస్తుందని అవనిగడ్డ శాసన సభ్యులు, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షులు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శనివారం ఐఎంఎ హాల్లో వైఎస్‌ఆర్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ' వెయ్యేళ్ల తెలుగు సాహిత్యం - రాయలసీమ భాగస్వామ్యం' అనే శీర్షికతో 2వ సాహిత్య, సాంస్కృతిక మహాసభలు 'సాహితీ సమరాంగణ సార్వభౌమ' శ్రీకృష్ణదేవరాయుల సభావేదికపై నిర్వహించారు. ప్రారంభ సభకు ముఖ్య అతిథిగా హాజరైన మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తొలి తెలుగు శాసనం పుట్టిన గడప రాయలసీమని, రాయలసీమవాసులు మరింత చైతన్యవంతులై భాషను సజీవంగా నిలిపేందుకు కృషి చేయాలన్నారు. జిల్లాలో 1970లలో కడప జిల్లా రచయితల సంఘం విస్తృతంగా మహాసభలను నిర్వహించి రాష్ట్ర స్థాయిలో ప్రముఖులైన అనేకమంది కవులు, రచయితలను ఆహ్వానించి విజయవంతంగా నిర్వహించారని పేర్కొన్నారు. ఆ స్ఫూర్తితోనే తాముకూడా కృష్ణా జిల్లా రచయితల సంఘం నెలకొల్పి విస్తృతంగా రాష్ట్ర స్థాయి కార్యక్రమాలు, ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. 32వేల సంకీర్తనలు రచించినవాడు మన తెలుగువాడైన తాళ్లపాక అన్నమయ్య ఒక్కడేనని, కానీ ఆవిషయాన్ని మనం ప్రపంచానికి తెలిసేలా చాటి చెప్పు కోలేకపోతున్నామని అసంతృప్తిని వ్యక్తం చేశారు. సభాధ్యక్షులు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విసి ఆచార్య వెలుదండ నిత్యానందరావు మాట్లాడుతూ రచయితలు ధైర్యంగా సమాజంలో ఉన్నటువంటి లోపాలను ఎత్తిచూపేలా రచనలు చేయాలన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రజలను చైతన్యం పరిచేలా తొలి చారిత్రక మహాకావ్యం రాయలసీమ గడ్డపైనే పుట్టిందన్నారు. ఆత్మీయ అతిథి, ప్రసిద్ధ చలన చిత్ర నటుడు శివకృష్ణ మాట్లాడుతూ కవులకు, కళాకారులకు రాయలసీమ పెట్టింది పేరన్నారు. కవులు, రచయితులు బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. విశిష్ట అతిథి, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు శలాక రఘునాథశర్మ మాట్లాడుతూ తెలుగు భాష అమృతం వంటిదని, ఇతర ఏ భాషలో లేనటువంటి నడక తెలుగు పద్యానికి ఉందన్నారు. జిల్లా రచయితల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు, మరో ఆత్మీయ అతిథి షేక్ హుసేన్ సత్యాగ్ని మాట్లాడుతూ శివతాండవం వెలుగు చూసి గడ్డ రాయలసీమ అంటూ శివతాండవం గేయాన్ని ఆలపించి సభను ఉత్తేజపరిచారు.

మొక్కుబడి

ప్రజాదృష్టి

ఇటీవలి డిఆర్‌సి, జడ్‌పి సమావేశాలు మొక్కుబడిని తలపించాయి. జిల్లా డెవలప్‌మెంట్ రివ్యూ మీటింగ్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత సమక్షంలో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తలసరి ఆదాయం పెంపు, డిపార్టుమెంట్ల వారీగా 15 నుంచి 18 శాతం అభివృద్ధిని సాధిస్తామని ప్రగల్భాలు చెప్పుకోవడానికి ఉపకరిస్తుందనడంలో సందేహంలేదు. ఇందుకు 2020 లక్ష్యాలే చక్కటి ఉదాహరణ. ప్రతిఏటా పెరుగుతున్న ధరలు, మారుతున్న కాలానికి అనుగుణంగా 15 శాతం వృద్ధిని లక్షించడం కద్దు. కానీ 18 శాతానికిపైగా సాధిస్తేనే నిజమైన వృద్ధిగా చెప్పుకోవచ్చు. కానీ ఆచరణలో ఇటువంటి అవకాశాలు కలిగిన డిపార్టుమెంట్లను గుర్తించాలి. అటువంటి విభాగాలకు సమర్థులైన అధికారులను నియమించాలి. అటువంటి విభాగాల పట్ల ప్రత్యేక చొరవ చూపించాలి. ప్రత్యేక రోడ్‌మ్యాప్ లేకుండా మొక్కుబడి లక్ష్యాలను ప్రకటించు కోవడం ప్రజల్ని మోసగించడమే అవుతుందని గమనించాలి. విజనరీ ఉండాల్సిందే, కాని ఫలితాల సాధన పట్ల చిత్తశుద్ధి ఉండాలి. ఇటువంటి తరహాలోనే వరుసగా జడ్‌పి స్టాండింగ్ కమిటీ సమావేశాల దగ్గర నుంచి జడ్పీ సర్వసభ్య సమావేశాల వరకు మొక్కుబడిని తల పించడం గమనార్హం. ఇటువంటి తరహా కార్యక్రమాల నిర్వహణ ద్వారా ఉదాత్తమైన ఆశయాలను ఎలా సాధిస్తారో ఆలోచన చేయాలి. జిల్లా పరిషత్ సిఇఒకు సమావేశాల నిర్వహణ పట్ల అవగాహన కొరవడిన ఫలితమా, లేక రాజకీయ నాయకుల్లో చిత్తశుద్ధి లోపమా అనేది తేలాల్సి ఉంది. ఒక మహిళా ఉన్నతాధికారికి జిల్లా రాజకీయ నాయకత్వం సహకారం అందించాలి. కానీ గత స్టాండింగ్ కమిటీ సమావేశంలో కోరమ్ లేకపోవడంతో గంటల తరబడి వేచి చూడాల్సి రావడం, తాజా జడ్‌పి సర్వసభ్య సమావేశం నిర్వహణకు కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు గైర్హాజరైన నేపథ్యాన్ని పరిశీలిస్తే కార్యనిర్వాహక వర్గమైన జిల్లా అధికార యంత్రాంగం, శాసన నిర్వహణ నాయకత్వ లోపమూ ఉందనేది నిష్ఠుర సత్యం. ఢిల్లీ నుంచి పార్లమెంట్ సభ్యులు వైస్ అవినాష్‌రెడ్డి సర్వసభ్య సమావేశానికి వస్తే, జిల్లాలోనే ఉంటున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ అతిదీసింగ్ హాజరు గాకపోవడం ఏమిటో ఆలోచించుకోవాలి. ఇది జిల్లా పరిషత్ పాలక వర్గానికి అవమానం అనుకోవాలా, జిల్లా రాజకీయ నాయకత్వానికి అవమానం అనుకోవాలో తెలియడం లేదు. లేక కూటమి తరుపున ప్రజాప్రతినిధులు గైర్హాజరు సమాచారాన్ని తెలుసుకుని ఉద్దేశపూర్వ కంగానే నిర్లక్ష్యం చేశారా అనేది తెలియడం లేదు. నిజంగానే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి కంటే మించిన కార్యక్రమం ఉంటే జిల్లా సర్వోన్నతాధికారి తాత్కాలికంగా గంట పాటైన హాజరై, వెళ్లి పో యి ఉండాల్సి ఉంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో వైసిపి నాయకత్వం జిల్లా సర్వోన్నతాధికారి లేకుండా సమస్యలు ఎవరికి చెప్పాలి, ఎలా పరిష్కారం అవుతాయో చెప్పాలని సిఇఒను నిలదీయ డం సబబే. కానీ కూటమి ప్రజాప్రతినిధులు హాజరైన సమావేశాల్లో ఇటువంటి తరహాలో హుందాతనాన్ని ప్రదర్శించాలి. అప్పుడు మాత్రమే ఉమ్మడి జిల్లా ప్రజల సమస్యల పట్ల లోతైన చర్చ జరగడంతో పాటు సమర్థవంతమైన పరిష్కారం లభించేదనడంలో సందేహం లేదు.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉర్దూకు హిందుస్థానీ భాషగా గుర్తింపు

-రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల శాఖ సలహాదారు ఎం.ఎ.షరీఫ్



సమావేశంలో మాట్లాడుతున్న షరీఫ్

ప్రజాశక్తి-పీలేరు


ఉర్దూ హిందుస్తానీ భాషగా గుర్తింపు పొందిందని, ఉర్దూ మాధ్యమంలో విద్య అభ్యసించిన వారు దేశంలో ఎక్కడైనా రాణించ గలుగుతారని రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల శాఖ సలహాదారు ఎం.ఎ. షరీఫ్ పేర్కొన్నారు. శనివారం ఆయన పీలేరులో నిర్మాణంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పట్టణ మైనార్టీలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. షరీఫ్ మాట్లాడుతూ ఉర్దూ విద్య నీతి, నిజాయితీ,నిబద్ధతలను నేర్పుతోందని, ఉర్దూ మాధ్యమానికి తెలుగు రాష్ట్రాల్లో ఎంతో మంచి గుర్తింపు ఉందని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ఉర్దూ మధ్యమంలోనే ఎంబిబిఎస్ చదివారని, ఇలాంటి ప్రముఖులు ఎందరో ఉర్దూ మాధ్యమంలో విద్యను అభ్యసించి ఎన్నో ఉన్నత పదవుల్లో, ఉద్యోగాల్లో విధులు నిర్వహించారని, నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. ముస్లిం మైనార్టీల పిల్లలు విద్యాపరంగా ఎదగాలన్న ఆశాభవాన్ని వ్యక్తం చేశారు. తెలుగుదేశం ప్రభుత్వ గత పాలనా కాలంలోనే సిఎం చంద్రబాబు మైనార్టీ విద్యార్థుల కోసం రాష్ట్రంలో 12 గురుకులాలను ప్రారంభించారని చెప్పారు. ప్రతి గురుకులంలోనూ విద్యార్థులు 450 మందికి పైగా పిల్లలు చేరి విద్య అభ్యసిస్తుండడం మంచి పరిణామామని సంతోషాన్ని వ్యక్తం చేశారు. అంతేకాకుండా గురుకులాల్లో చదివే విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు సాధారణ విద్యతో పాటు ఎంసెట్, ఐఐటి, నీట్, తదితర పోటీ పరీక్షల కోసం కూడా వారికి శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. తెలుగుదేశం ప్రభుత్వ పాలనలోనే మైనారిటీల సంక్షేమం అభివృద్ధికి మార్గం ఏర్పడిందని తెలియజేశారు. స్థానిక మైనార్టీ పెద్దలు మాట్లాడుతూ పీలేరులో ఉర్దూ జూనియర్ కళాశాల, ఉపాధ్యాయ శిక్షణ కేంద్రం ఏర్పాటు వంటివి చిరకాల కోరికలని, ఇక్కడి విద్యార్థులు 10వ తరగతి తర్వాత సౌకర్యాలు లేక ఉన్నత చదువులకు వెళ్లలేకున్నారని అన్నారు. ఈ సందర్భంగా స్పందించిన షరీఫ్ మాట్లాడుతూ పీలేరులో ఉర్దూ జూనియర్ కళాశాల ఏర్పాటు చాలా అవసరమని, మండల విద్యాశాఖ అధికారి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని సూచించారు. పాఠశాల కు అవసరమైన ప్రాంగణ నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి చొరవతో మొదటి విడతగా రూ.25 లక్షలు నిధులు రానున్నాయని, వాటితో పనులు మొదలుపెడితే అవసరానుకూలంగా మిగిలిన నిధులను తెప్పించుకోడానికి అవకాశం ఉందని అన్నారు. అనంతరం భారత మాజీ రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. సమావేశంలో మాజీ జడ్‌పిటిసి డాక్టర్ మల్లెల రెడ్డి బాష, మైనార్టీ నాయకురాలు పర్వీన్ తాజ్, అతిక షఫీ ఉల్లా, నల్లారి రియాజ్, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు ఎస్‌ఎండి షఫీ, ఇందాదుల్లా, లడ్డు జాఫర్, మహమ్మద్ పిర్, ఎన్టీఆర్ నఫీస్, అల్లావుద్దీన్, కోటపల్లి బాబు రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అమర్నాథరెడ్డి పాల్గొన్నారు.

ఆదినిమ్మాయపల్లి డ్యామ్‌లో పడి
ఇద్దరు నేపాల్ యువకులు మృతి

- మృతులు చెన్నూరు దమ్ బిర్యానీ సెంటర్‌లో కార్మికులు

ప్రజాశక్తి - వల్లూరు

మండలంలోని ఆదినిమ్మయపల్లి డ్యామ్‌లో పడి నేపాల్‌కు చెందిన ఇద్దరు యువకులు మృతిచెందారు. పోలీసుల వివరాల మేరకు చెన్నూరు మండలం శివరాం దమ్ బిర్యానీ సెంటర్‌లో పనిచేస్తున్న పది మంది యువకులు ఆదినిమ్మాయపల్లి డ్యామ్ వద్దకు సరదాగా గడపడానికి వచ్చారు. ఆనకట్ట వద్ద ఈత కొడుతున్న ఇద్దరు యువకులు బిరేంద్ర (36) బిర్రీ (36) ప్రమాద వశాత్తు నదిలో పడి గల్లంతయ్యారు. మిగిలిన వారు స్థానికులకు, పోలీసులకు సమాచారం అందించారు. జాలర్లు నదిలో దిగి వారిని వెలికి తీయడంతో అప్పటికే మృతిచెందారు. సిఐ రోషన్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. హోటల్ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం కడప రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతులిద్దరికీ వివాహమైంది. కుటుంబం నేపాల్‌లో నివాసముంటున్నారు.



బిరేంద్ర



బిర్రీ


బాలుర పాఠశాల ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రం గాలివీడులోని కదిరి-రాయచోటి ప్రధాన రహదారిలోని బాలుర ఉన్నత పాఠశాలకు సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుపైన చేతికందే ఎత్తులో ఉండటంతో వాహనదారులు, విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. నిత్యం విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారని ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరకు వెళితే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. వాహనదారులు అదుపుతప్పి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొనే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు దృష్టి పెట్టి ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు పెంచాలని, లేకుంటే వేరే ప్రాంతానికి తరలించాలని కోరుతున్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని ఎస్‌బివిజి సభ క్రీడా ప్రాంగణంలో ముక్కా రూపానంద రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరుపతి శ్రీ అరవింద కంటి ఆసుపత్రి వారిచే ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తున్నట్లు సామాజికవేత్త ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరానికి నియోజకవర్గంలోని కంటికి సంబంధించి ఎవరికైనా ఇబ్బంది ఉన్నట్లయితే వారికి ఉచిత ఆపరేషన్ చేయించడం జరుగుతుందని పేర్కొన్నారు. కంటిలోని శుక్లాలు ఉన్నవారికి ఇది చక్కటి అవకాశం అని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరానికి వచ్చు వారు వెంట ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరానికి వచ్చు వారికి భోజన వసతి కల్పించడం జరిగిందని తెలిపారు.

సూర్య,చంద్రప్రభ వాహనాలపై వెంకన్నస్వామి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని కోసవారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో ఆరు రోజులుగా టిటిడి ఆధ్వర్యంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. టిటిడి ఆగమ అడ్వైజర్ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు కృష్ణ ప్రసాద్‌భట్టర్, రమేష్‌బాబు, కృష్ణమూర్తి, ధనుష్ సాంప్రదాయబద్ధంగా నియమ నిష్ఠలతో ఉదయం సూర్య ప్రభ వాహనంపై శ్రీవారి ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం చంద్రప్రభ వాహనంపై నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్స్‌పెక్టర్ దిశాంత్‌కుమార్, ఆలయ సిబ్బంది నగేష్, నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.


సూర్యప్రభ వాహనంపై వెంకన్నస్వామి


శివకోటిని సత్కరిస్తున్న ఎఎస్‌పి

క్రికెటర్ శివకోటిని సన్మానించిన ఎఎస్‌పి

ప్రజాశక్తి-నందలూరు

నేపాల్‌లో బోర్డ్ ఆఫ్ డిజేబుల్డ్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో జరగబోయే టి20, వన్డే సిరీస్‌కు భారత జట్టుకు ఎంపికైన నందలూరు మండల వాసి ఏలుసూరి శివకోటిని రాజంపేట ఎఎస్‌పి మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే శాలువాతో ఘనంగా సన్మానించారు. శివకోటి క్రీడా జీవితం గురించి అడిగి తెలుసుకుని అభినందించారు. ఈ సందర్భంగా శివకోటి మాట్లాడుతూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి వెళ్లాలని, ఎటువంటి అవసరం ఉన్నా సరే తప్పకుండా క్రీడాకారులను ప్రోత్సహించే విషయంలో ముందుంటానని ఎఎస్‌పి తెలిపారని అన్నారు. కార్యక్రమంలో రాజంపేట రూరల్ సిఐ బి.వి.రమణ, ఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

ప్రజాశక్తి - తొండూరు

ఈనెల 10న స్థానిక పిహెచ్‌సి ఆధ్వర్యంలో నులి పురుగుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు డాక్టర్ అరిపుల్ల, డాక్టర్ రేష్మ తెలిపారు. ఆ మేరకు శనివారం వారు వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అరిపుల్ల మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఎంపిడిఒ పర్యవేక్షణలో నిర్వహిస్తారన్నారు. అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలు ప్రభుత్వ ప్రయివేట్ విద్యాసంస్థల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఒక గంట తర్వాత మాత్రలు మింగించాలని సూచించారు. విద్యా సంస్థల్లో ఏక కాలంలో ఈ కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. **సింహాద్రిపురం :** పిల్లల్లో నులిపురుగుల నివారణ కోసం అందరి సహకారంతో విజయవంతం చేద్దామని ఎంపిడిఒ కృష్ణమూర్తి సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం ఈనెల 10న జరుగుతుందన్నారు. ఏడాది నుంచి 19 ఏళ్లలోపు పిల్లలు మండలంలో దాదాపు 16,500 మంది ఉన్నారన్నారు. ప్రతి అంగన్వాడీ, ప్రభుత్వ, ప్రయివేట్, ఎయిడెడ్ స్కూల్స్, కళాశాలల్లో చదువుతున్న వారందరికీ ఆల్బెండజోల్-400 ఎంజి మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ కోరారు.

తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రాజ్యాంగ విరుద్ధంగా వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని రెడ్డి కమ్యూనిటీ రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రరెడ్డి శనివారం పులివెందుల డిఎస్‌పి మురళి నాయక్‌కు ఫిర్యాదు చేశారు. స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో రెడ్డి సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నెల 2న వరంగల్ బిసి యుద్ధభేరి సభలో తీన్మార్ మల్లన్న అనుచిత వ్యాఖ్యలు చేశారని, తన రాజకీయ స్వార్థం కోసం ఒకరిని ముఖ్యంగా రెడ్డి సామాజిక వర్గంపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తప్పు పట్టారు. కార్యక్రమంలో రాయలసీమ కన్వీనర్ చెప్పిలి జగదీశ్వర్‌రెడ్డి, శివ లోకేశ్‌రెడ్డి, రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

కడప ఉక్కు.. మనందరి హక్కు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

కడప ఉక్కు ఈ ప్రాంత ప్రజల హక్కు అని డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు ఎల్లయ్య తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కడప ఉక్కుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ శనివారం స్థానిక ఎస్‌సి కాలేజీ హాస్టల్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ కడప ఉక్కు ఆంధ్రుల హక్కు అన్నారు. కడప ఉక్కు భిక్ష కాదన్నారు. విభజన చట్టంలో స్పష్టంగా రాసుకున్న ఎందుకు అమలుచేయడం లేదన్నారు. ఆనాటి నుంచి కడప ఉక్కుకు అన్యాయం జరుగుతూనే ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు, ముఖ్యమంత్రులు మారుతున్నా కడప ఉక్కు కల నెరవేరడం లేదన్నారు. కార్యక్రమంలో చంద్ర, అశోక్, సురేంద్ర, తేజ, రవి, మస్తాన్ పాల్గొన్నారు.

తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేసిన సబ్‌స్టాఫ్

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని ఎపిఎండిసి పబ్లిక్ స్కూల్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు శనివారం సిఐటియు ఆధ్వర్యంలో భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎపిఎండిసి పబ్లిక్ స్కూల్‌లో స్కావెంజర్స్, హౌస్ కీపింగ్, సబ్ స్టాఫ్ ను పునరావాస కార్మికులను మూడు నెలల జీతం అడిగినందుకు ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా సబ్ తొలగించడం అన్యాయమని పేర్కొన్నారు. ఎటువంటి కొత్తగా టెండర్ లేకుండా లోపాయికారి ఒప్పందంతో అక్రమ కాంట్రాక్టర్ ఉషోదయ పబ్లిక్ ఎడ్యుకేషన్ కాంట్రాక్టర్ మహేష్ నాయుడు మాకు మీరు అవసరం లేదని, ఉన్నవారితో పని చేయించుకుంటామని నోటీసులు ఇవ్వకుండా తొలగించడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. ఈ విషయం అధికార పార్టీ టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, కూడా చైర్మన్ ముక్కారూపానంద రెడ్డి, ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్ దృష్టికి తీసుకెళ్లగా వారు లేఖ ఇచ్చి తొలగించిన సబ్ స్టాఫ్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని తెలిపారు. కాంట్రాక్టర్ జీతాలు ఇవ్వకపోతే నేనే ఇస్తానని రూపానంద రెడ్డి హామీ ఇచ్చారని అన్నారు. అయినా కాంట్రాక్టర్ గానీ, ఎపిఎండిసి యాజమాన్యం వారు కానీ ఆ లేఖను ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. నాలుగు నెలలుగా జీతాలు లేక పండుగ పూట కూడా పస్తులు ఉన్నారని అన్నారు. 25 రోజులు స్కూల్ గేటు వద్ద పడి కాపులు కాసారని గత 13 రోజుల నుంచి సిఐటియు ఆధ్వర్యంలో పాఠశాల ముందే రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారని అన్నారు. కుటుంబం పిల్లలు పస్తులు ఉండటంతో వినూత్న పద్ధతిలో మంగంపేటలో జోలిపట్టి భిక్షాటన చేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు గానీ స్పందించి తగిన న్యాయం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్, మండల కార్యదర్శి నాగిపోగు పెంచలయ్య, బాధితులు లతా, లక్ష్మీదేవి, శాంతమ్మ, రాణి, గ్రేసమ్మ, చిట్టెమ్మ, దేవి, ప్రసన్న, వరలక్ష్మి పాల్గొన్నారు.


జోలిపట్టి బిక్షాటన చేస్తున్న తొలగింపబడిన ఉద్యోగులు

వైసిపికి పూర్వ వైభవం తీసుకొస్తాం

మండల అధ్యక్షులు కొమ్మేపల్లి శ్రీనివాసులరెడ్డి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

వైసిపికి పూర్వ వైభవాన్ని తీసుకువస్తామని నూతనంగా నియమితులైన వైసిపి పార్టీ మండల అధ్యక్షులు కొమ్మేపల్లి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. ఇటీవల నియోజక వర్గస్థాయిలో వైసిపి అనుబంధ విభాగాలలోని పంచాయతీరాజ్ విభాగానికి కె.రెడ్డిశేఖర్‌రెడ్డి, వాణిజ విభాగానికి నూర్ మొహిద్దిన్‌ఖాన్, గ్రీవెన్స్ సెల్ విభాగానికి నాగరాజాను పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా శనివారం వారు బాధ్యతలు చేపడుతూ మండల నాయకులు కార్యకర్తలతో కలసి అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ఎంపిపి జయప్రకాశ్‌రెడ్డి, వైసిపి నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, రామారావు, శశిధర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, రెడ్డిభాస్కర వారిని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైసిపి అధ్యక్షులు జగన్ మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే దేశాయి తిప్పారెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్ కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆదేశాలకు, లక్ష్యాలకు అనుగుణంగా నాయకులందరూ కలిసికట్టుగా పనిచే స్తామ న్నారు. గత ఎన్నికల్లో కూడా వైసిపికి నిమ్మన పల్లిలో మెజారిటీ లభించిందన్నారు. త్వరలోనే పార్టీ కార్యకర్తలతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించి, వారి సూచనలు సలహాలను తీసుకొని పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్‌రఫీ, నాయకులు రామారావు, దయాకర్‌రెడ్డి, ఆదినారాయణ, రెడ్డి భాస్కర, ఎర్రయ్య, డవ్ నాగరాజా, రవి, కొండగాళ్ల రమణ, హోటల్ రఫీ, మౌలాలి, ఉదయ్ శేఖర్ రెడ్డి, రాజగోపాల్, హేమంత్, యోగానంద రెడ్డి పాల్గొన్నారు.


శ్రీనివాసులరెడ్డితో వైసిపి నాయకులు

బిసి విభాగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యం

బి.కొత్తకోట : జిల్లాలో వైసిపి బిసి విభాగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యమని ఆపార్టీ బిసి సెల్ జిల్లా అధ్యక్షులు ఉజ్జయిని సాంబశివ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా వైసిపి బిసి సెల్ కమిటీ నియమకాల్లో భాగంగా జిల్లా అధ్యక్షుడిగా తనను నియమించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామ చంద్రారెడ్డి, మదనపల్లి వైసిపి ఇన్‌ఛార్జి నిస్సార్ అహ్మద్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో మాజీ మాజీ సిఎం జగన్ బిసిలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని, అనేక నామినేటెడ్ పోస్టులు ఇచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో బిసి నాయకులు వైస్ ఎంపిపి ఖాదర్‌వలీ, సర్పంచులు శ్రీని వాసులు, నాగరత్న, ఈశ్వర్, జి.శ్రీనివాసులు, నాయకులు సుబ్బారెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్లు నేరెళ్ల రెడ్డిహరి, ఆర్‌సి.ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్పత్తిదారుల సేకరణ కేంద్రం రైతులకు ఉపయోగం



రైతు ఉత్పత్తిదారుల కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న శ్రీనివాసులు

ప్రజాశక్తి-వీరబల్లి

రైతు ఉత్పత్తి దారుల సేకరణ కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం మండల రైతు ఉత్పత్తి దారుల సేకరణ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యానశాఖ రూ.11.25 లక్షలు, ఎఫ్‌పిఒ భరిస్తుందన్నారు. ఈ కేంద్రం రైతులకు గిట్టుబాటు ధర, ఉత్పత్తు లను నిల్వచేయడానికి ఉపయోగించాలని తెలిపారు. రైతులకు కావలిసిన వ్యవసాయ పరికరాలను అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎపిఎం ఖాదర్‌వలి, ఫ్‌పిఒ సిసి గంగాధర్, రైతు మిత్రలు జనమేజయుడు, వెంకటేష్, మండల రైతు సమాఖ్య అధ్యక్షులు రాచన్న, కార్యదర్శి చింతాతి రామయ్య, కోశాధికారి రామ్‌ప్రసాద్, అకౌంటెంట్ మరియమ్మ పాల్గొన్నారు.

ఘనంగా 'ఎంజెఆర్'లో ఫ్రెషర్స్‌డే

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు ఎంజెఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఫ్రెషర్స్ డే, స్పోర్ట్స్ మీట్ సంబరాలు అట్టహాసంగా జరిగాయి. కళాశాల ఆవరణంలో ఈనెల 6న ప్రారంభమైన ఈ ఉత్సవాలు నుంచి 8వ తేదీ శనివారం వైభవంగా ముగిసాయి. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ ఎంపి అవినాష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని నింపడం కోసం 6, 7 తేదీల్లో జిల్లాస్థాయిలో స్పోర్ట్స్ మీట్ నిర్వహించామని అన్నారు. అబ్బాయిలకు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ పోటీలు, అమ్మాయిలకు ఖోఖో, కబడ్డీ, త్రోబాల్ పోటీలు జరిపామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవిఎన్‌విఎన్ రావు తెలిపారు. శనివారం ఫ్రెషర్స్‌డే సంబరాల్లో భాగంగా విద్యార్థుల్లో సంస్కృతిక చైతన్యం నింపేందుకు వివిధ రకాల సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా జబర్దస్త్ ఫేమ్, ప్రముఖ సినీ, టివి కళాకారులు రచ్చ రవి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన అతిథులు మాట్లాడుతూ విద్యార్థులు తాము ఎంచుకున్న రంగంలో ముందంజ వేస్తూ రాణించాలని అన్నారు. చివరిగా కార్యక్రమానికి వచ్చిన అతిథుల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో పాల్గొన్న అతిథులతో విద్యార్థులు

పోక్సో కేసులో నిర్లక్ష్యం వహిస్తున్న పోలీసులు

-విలేకర్ల సమావేశంలో బాధితురాలి తల్లి ఆవేదన

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు నియోజకవర్గం పరిధిలోని కలికిరి మండలం, పల్లవోలు పంచాయతీ, గడి గ్రామంలో ఓ బాలికపై జరిగిన సంఘటనపై పోక్సో చట్టం కింద నమోదైన కేసులో కలికిరి పోలీసులు నిర్లక్ష్యంగా ఎందుకు వ్యవ హరిస్తున్నారో తెలియడం లేదంటూ బాధితురాలి తల్లి సుమయ తన ఆవేదనను వ్యక్తం చేశారు. కేసు పురోగతిపై శనివారం ఆమె పీలేరులో విలేకరులతో మాట్లాడుతూ గడి గ్రామానికి చెందిన వైసిపి నేత జుబేర్ అహ్మద్ కుమారుడు జునైద్ అహ్మద్ గత నెల 23వ తేదీ రాత్రి తన కుమార్తెపై అఘాయిత్యానికి పాల్పడ్డాడన్నారు. అదే రోజు తాము ఫిర్యాదు చేసినా కలికిరి పోలీసులు పట్టించుకోలేదన్నారు. చివరకు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి జోక్యంతో జనవరి 25న జునైద్‌పై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారన్నారు. కేసు నమోదు చేసినప్పటికీ నిందితుడిని అరెస్టు చేయడంలోగానీ, నిందితుడు వినియోగించిన వాహనాన్ని సీజ్ చేయడం గాని జరగలేదని ఆమె వాపోయారు. ఈ విషయమై తాము పలుమార్లు కోరినా కలికిరి సీఐ రెడ్డిశేఖర రెడ్డి దాటవేత ధోరణిలో సమాధానం ఇస్తున్నారని అన్నారు. ఈలోపు నిందితులు బంధువులైన పల్లవోలు పంచాయతీ సర్పంచ్ బీబీ ఆయిషా భర్త ఇస్తియాక్ అహ్మద్, నిందితుడి సమీప బంధువైన మునీర్ తమ ఇంటికే వచ్చి బెదిరించారని ఆరోపించారు. నిందితుడిని అరెస్టు చేయకుండా తాము పోలీసు లకు రూ.5 లక్షలు లంచం ఇచ్చామని, తమకు కూడా రూ.7 లక్షలు పరిహారం చెల్లిస్తామని, ఆ డబ్బు తీసుకుని రాజీ పోవాలని సూచించారన్నారు. రాజీకి అంగీకరించకపోతే లారీలతో గుద్ది తనను, తన భర్తను చంపేస్తామని బెదిరించారన్నారు. వారు బెదిరించిన విషయాన్ని పోలీసులకు తెలియజేసినా వారు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేసింది. కేసును రాయచోటి డిఎస్‌పి విచారిస్తున్నారని, ఆయన వచ్చి విచారణ చేసేంత వరకు తాము ఏమీ చేయలేమని ఆయన చెప్పారని సుమయ తెలిపారు. ఇదే విషయాన్ని తాము ఇటీవల సంబేపల్లెలో జరిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలో ఆయనకు వినతి పత్రం అందజేశామని, అప్పటి నుంచి తమకు ఫోనుల్లో బెదిరింపులు ఎక్కువయ్యాయని అన్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి తమకు న్యాయం చేయాలని ఆమె కోరారు. తమ కుమార్తెపై అఘాయిత్యానికి పాల్పడిన జునైద్ అహ్మద్, తమను బెదిరించిన మునీర్, ఇస్తియాక్ అహ్మద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఇదే విషయాన్ని శనివారం పీలేరులో మైనారిటీ వ్యవహారాల రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎం.ఎ. షరీఫ్ దృష్టికి తీసుకెళ్లా మన్నారు. తమ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.


జునైద్ వివరాలను వెల్లడిస్తున్న బాధితురాలి తల్లి సుమయ

మళ్లీ పులుల సంచారం.. రైతుల్లో కలకలం

ప్రజాశక్తి - లింగాల

మొన్న రామాపురంలో చిరుతపులి విద్యుత్ ప్రమాదంతో చనిపోయిన విషయం విది తమే. ఆ సంఘటన మరు వక ముందే మళ్లీ శనివారం మండలంలో పులుల కని పించాయంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని కామ సముద్రంలో మిద్దె ఆది నారాయణ అనే రైతు తన పొలం వద్దకు రెండు గంటల సమయంలో వెళ్లగా పంట పొలాల్లో నుంచి ఒక పెద్దపులి, మూడు చిన్న పులులు వెళుతూండడంతో.. ఆ రైతు తహశీల్దార్ ఈశ్వరయ్యకు సమాచారమిచ్చారు. తహశీల్దార్ అటవీశాఖ అధి కారులకు విషయాన్ని చేరవేశారు. రైతులు ఎవరూ ఒంటరిగా పొలాల వద్దకు వెళ్లవద్దని తహ శీల్దార్ సూచించారు. అటవీశాఖ అధి కారులు పులులు సంచరించన ప్రాంతంలో పర్య టించారు. ప్రజలు అప్ర మత్తంగా ఉండాలన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి- చక్రాయపేట

ప్రముఖ పుణ్యక్షేత్రం గండి శ్రీవీరాంజనేయ స్వామి శాశ్వత నిత్యాన్నదాన పథకానికి పాలెంపల్లె గ్రామానికి చెందిన భక్తుడు మేకల హనుమంతయ్య కుమారుడు ఆంజనేయులు రూ.1,00,116 విరాళాన్ని అందజేశారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు కేసరి స్వామి ప్రత్యేక దర్శనం చేయించి, తీర్థ ప్రసాదాలు అందజేసి, శేష వస్త్రం, స్వామి వారి చిత్రాపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ భక్తులకు నిత్యాన్న దానం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భీష్మ ఏకాదశిని పునస్కరించుకుని స్వామి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. అన్నదానం విరాళాలు, ఇతర కార్యక్రమాల ద్వారా శనివారం ఒక్కరోజే రూ.4,62,096 ఆదాయం వచ్చినట్లు ఎసి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, అర్చకులు పాల్గొన్నారు.


క్రీడాకారులతో యల్లటూరు శ్రీనివాసరాజు

యువత క్రీడల్లో రాణించాలి :'యల్లటూరు'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

యువత క్రీడల్లో రాణించాలని జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ సమన్వయ కర్త యల్లటూరు శ్రీనివాసరాజు పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రాజంపేట ప్రిమియర్ లీగ్-ఆర్‌పిఎల్ 2025 క్రికెట్ టోర్నమెంట్‌ను బండ్ల నాగరాజ, లింగం హరీష్, పోలి మహేష్, జగదీష్, మహేష్ ఆద్వర్యంలో రాజంపేట పార్లమెంటు కూటమి నాయకుల సహకారంతో క్రికెట్ ప్రిమియర్ లీగ్‌ను యల్లటూరు ప్రారంభించారు. విజేతలకు చివరిగా ఇచ్చే రెండవ బహుమతికి ఆర్థిక సహకారం అందించారు. ఈ సందర్భంగా యల్లటూరు మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించి పుట్టిన ప్రాంతంతో పాటు దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్రీడాకారులు, యువత, కూటమి నాయకులు పాల్గొన్నారు.


పాఠశాల ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి-కలికిరి

ఒకానొక వ్యక్తి తన అనుకున్నది సాధించడానికి శ్రద్ధగా చదువుకోవటం ఒకటే మార్గమని ముఖ్యఅతిథిగా పాల్గొన్న సాహితీవేత్త ఎస్‌వియు పాలకమండలి పూర్వ సభ్యుడు డాక్టర్ వేంపల్లి అబ్దుల్‌ఖాదర్ అన్నారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం.శారద అధ్యక్షత వహించారు. కలికిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 72 సంవత్సరాల బ్యాచ్ విద్యార్థులు 52 సంవత్సరాల తరువాత మళ్లీ కలుసుకొని సందడి చేశారు. తాము చదువుతున్న పాఠశాలకు లక్ష రూపాయల కంప్యూటర్ పరికరాలు వితరణ చేశారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన గురువులను పూర్వ విద్యార్థులు జ్ఞాపిక, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎం సుబ్బరాజు శెట్టి, ఎం.పంచరత్నమ్మ, జే రుద్రయ్య, నారాయణరెడ్డి సన్మానించిన వారిలో ఉన్నారు. ప్రధానకర్తలు సి సురేందర్ రెడ్డి, బివిరెడ్డి ఆధ్వర్యంలో ఈ కలయిక వేడుకలు జరిగాయి. అనంతరం ఒక్కో ఉపాధ్యాయుడి చేత ఒక మొక్క జ్ఞాపకార్థం నాటించారు. విద్యార్థులు ఉపాధ్యాయులు అందరికీ భోజనం ఏర్పాట్లు చేసి తాము చదువుకున్న పాఠశాల రుణం తీర్చుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రులకు ర్యాంకింగ్ అనేది సెల్ఫ్ గోల్

వేంపల్లె : కూటమి ప్రభుత్వం మంత్రులకు ర్యాంకింగ్ ఇవ్వడం అనేది సెల్ఫ్ గోల్ కొట్టుకోవడమేనని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ర్యాంకింగ్‌ను మంత్రులకు చెప్పాలే కానీ.. అలా కాకుండా టాంటాం చేయడం సమంజసం కాదన్నారు. ర్యాంకింగ్‌లో సిఎం చంద్రబాబుకు 6వ ర్యాంకు, లోకేష్‌కు 8వ ర్యాంకు, పవన్ కల్యాణ్‌కు 10వ ర్యాంకు రావడం ద్వారా ప్రజల్లో, కార్యకర్తల్లో మంత్రుల్లో వారి పట్ల చులకన భావం వస్తుందని పేర్కొన్నారు. కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని రాయలసీమలో ఏర్పాటు చేయాలని కోరారు. కృష్ణా బోర్డు కార్యాలయాన్ని విజయవాడలో కాకుండా రాయలసీమలో శ్రీశైలం జలాశయానికి సమీపంలో ఏర్పాటు చేయడం సమంజసమన్నారు. ఆ కోణంలో

క్రైం కార్నర్


నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి 80 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ భీమలింగ తెలిపారు. సిఐ తెలిపిన వివరాల మేరకు.. శనివారం మదనపల్లె పట్టణం పుంగనూరు రోడ్డులో తనిఖీలు చేస్తుండగా మదనపల్లి మండలం, చంద్రమాకులపల్లి క్రాస్ వద్ద నల్లగుట్టపల్లి తాండాకు చెందిన రమేష్‌నాయక్, సురేంద్రనాయక్ నాటుసారా తరలిస్తూ పారిపోయేందుకు ప్రయత్నించారు. దాడి చేయగా రమేష్‌నాయక్ పట్టుబడగా, సురేంద్రనాయక్ పారిపోయాడు. వారి వద్ద 80 లీటర్ల నాటుసారా, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని రమేష్ నాయక్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. పరారీలో ఉన్న సురేంద్రనాయక్‌ను త్వరలోనే అరెస్ట్ చేస్తామని సిఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ జబీవుల్లా, హెడ్‌కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, వీరనాగయ్య, కానిస్టేబుల్స్ దామోదర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

తండ్రి మృతి తట్టుకోలేక తనయుడి ఆత్మహత్య

ప్రజాశక్తి-బి.కొత్తకోట

తండ్రి మృతిని జీర్ణించుకోలేక తనయుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బి.కొత్తకోట మండలంలో శనివారం జరిగింది. సిఐ జీవన్ గంగానాథ్‌బాబు కథనం మేరకు వివరాలు..ప్రకాశం జిల్లా, ఆలూరు మండలం, బస్టాండ్ సెంటరుకు చెందిన ఆవుల శ్రీనివాసులు కుమారుడు ఆవుల అభిలాష్ (32) సుబ్బిరెడ్డిగారిపల్లె కంకర్ మిషన్ వద్ద రూములో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. అభిలాష్ కు తనతండ్రి అంటే ఎంతో ప్రేమ, అభిమానం అన్నారు. ఆయన మరణించడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యేవాడని, ఒంటరి జీవితాన్ని భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డార కాగా మృతుడు కేసీవీఆర్ కంపెనీలో ఆరేళ్లుగా కాంక్రీట్ సర్వేయర్‌గా పనిచేస్తున్నాడన్నారు. మృతుడు సోదరుడు ఆవుల అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిఐ వెల్లడించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ బొజ్జనాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ : కేసు నమోదు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని కోటావురు పంచాయతీ, అమర నారాయణపురానికి చెందిన జి.చిన్నరెడ్డప్పరెడ్డి అనే రైతు పొలంలో ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని దుంగడుగులు దోచుకెళ్లారు. కురబలకోట ఎఇ శంకర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.